


ఇన్నాళ్ళ తరువాత శకుంతలని చూస్తా డనుకోలేదు రంగనాథం !

శకుంతల !

ఒక మధురమైన భావవీచిక !

ముద్దబంతి పూవులా వుంటుంది శకుంతల. చూసింది రెండుసార్లే అయినా, ఆ లేత ముఖంలో ముగ్ధత్వము అమాయికత్వము కొట్టవచ్చినట్లు కనిపించాయి రంగనాథానికి.

జీవితంలో మనిషి కొన్ని పొరపాట్లు

చేస్తాడు. అది మానవ సహజం. కాని జీవితాంతం బాధపడే పొరపాటు చేశాడు రంగనాథం. అదే శకుంతలని చూడటానికి వెళ్ళటం. శకుంతలని చూడకుండా వుండాల్సింది. ఆమె అలాంటి పని చేస్తుందని ఏనాడూ అనుకోలేదు. అనుకోటానికి కూడా ఆస్కారం లేదు!

రంగనాథం మేనమామ. ఇంటికి పెద్ద దిక్కు అయిన చలపతిరావు అంటూండేవాడు: "నువ్వు ఇంజనీరువి. నీకు రాళ్ళూ రప్పలూ తప్ప మనుష్యులు కనపడరా?" అని.

ఎంతమంది ఆడపిల్లల్ని చూసినా నచ్చలేదంటుంటే విసిగిపోయా డాయన. ఓ రోజు హఠాత్తుగా పిల్లని చూడాలి రమ్మని-శకుంతలని చూసినప్పుడు – రంగనాథం జీవితంలో మెరుపు మెరిసింది. ఆకాశమంటే శూన్యమే కాదనీ, అందమైన చందమామా ఆ చందమామని ఆశగా చూసే తారకలు వుంటాయనీ తెలిసింది. శకుంతలని చూస్తుంటే సౌందర్యానికి ఆత్మ వుందేమో ననిపించింది. అందాన్ని అందమైన హృదయమే గుర్తించగలదు. ఇన్నాళ్ళ తరువాత తన గుండె సౌందర్యగతమయింది. నిజంగా జీవితంలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన సమయము అది.

ఒక అవస్థ- మహాసౌందర్యంలో వైవిధ్యం పొందిన తొలి ప్రత్యూషం ఈ స్థితి. బాహ్య ప్రపంచాన్నే మరిచిపోయాడు. అతని కళ్ళముందు సౌందర్యదేవత ప్రత్యక్షమైంది. ఎవరూ లేరు. తనూ శకుంతలా మిగిలారు క్రమంగా అతనిలో 'నేను' అంతరించి పోయింది. తనే – శకుంతుల, శకుంతలే తను. ఈ భావంతో తన ఆత్మలో ప్రేమ సాక్షాత్కారం జరిగింది. ప్రేమ యొక్క సమగ్ర స్వరూపం అర్థమైంది. ఆత్మకు ఆత్మే అయింది. ఆ ప్రేమలోంచి ఆనందం అవిర్భవించింది-అతనిహృదయం పొంగిపొడుతుంది.

జీవితానికి విలువ ఇప్పుడే తెలిసి వచ్చింది. అతనిని బెదిరినకళ్ళతో ఒకేఒకసారి చూసి తల దించుకుంది శకుంతల. అతను కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడు ఆమెవైపు. చలపతిరావు మేనల్లుడ్ని చూసి నవ్వుకున్నాడు.

"మీవాడు మనిషైనాడమ్మోయ్." అన్నాడు నవ్వుతూ ఇంటికి వచ్చాక.

సంబంధం దాదాపు ఖాయమైంది.

కాని వారంరోజుల తరువాత ఒక ఉదయం నిద్రలేవగానే ఎక్కడివాళ్ళక్కడే స్తంభించిపోయినట్లుగా గమనించాడు. విచారంతో ఓ మూల కూర్చుంది తల్లి. చలపతిరావు ఫానురెక్కలు తిప్పుడూ ఆలోచిస్తున్నాడు.

"ఏం జరిగిందమ్మా?" అన్నాడు.

ఎవరూ బదులు చెప్పలేదు.

"ఎందు కలా వున్నారు?"

"ఆ సంబంధం వద్దులేరా మనకి?" చలపతిరావుకి రంగనాథం ఏమౌతాడోనని పట్టుకుంది.

"ఏం? ఎందుకు వద్దూ?"

చలపతిరావు తల వంచుకున్నాడు.

"కట్నం ఇవ్వలే మన్నారా?"

శూన్యమే జవాబిచ్చింది.

"ఉన్నట్లుండి ఎందు కింత మార్పు?"

రంగనాథం ప్రశ్నలు బాణాల్లా గ్రుచ్చుకుంటున్నాయి. చలపతిరావు తప్పించుకో లేకపోయినాడు.

"అది ఎవడితోనో లేచిపోయిందిట!"

రంగనాథం నిర్ఘాంతపోయాడు. అతని ఉత్సాహం నీరుకారిపోయింది.

తల్లి అక్కడ వుండలేక వెళ్ళిపోయింది.

"శకుంతలా?" అన్నాడు కంపిస్తున్న గొంతుతో.

చలపతిరావు మౌనంగా వూరుకున్నాడు.

"ఇంకా నయం. పిల్లవాడి గొంతు కోయలేదు." లోపలినుంచి తల్లి గొణుగుతున్నది.

"చూస్తూవుండు. రేపీపాటికి దీని తాతలాంటి సంబంధం తెచ్చి చేయకపోతే- ఎంత అవమానం! ఎంత అప్రతిష్ఠ!"

రంగనాథానికి చుట్టూవున్న ప్రపంచం గిర్రున తిరిగింది. అతనికి జీవతానికి పక్షవాతం వచ్చింది. అయోమయస్థితిలో పడిపోయాడు. తల్లిఓదార్పు అతని హృదయాన్ని చల్లార్చలేదు. శకుంతల వెలిగించిన దీపాన్ని తనే ఆర్పేసి వెళ్ళిపోయింది. ఇక ఎవరు వెలిగించగలరు? ఇంక తన కేం మిగిలింది? తన హృదయాన్ని మందిరంగా చేశాడు. శకుంతలే రానంది. ఏమి టీ పొరపాటుకు కారణం? తన అనుభవాల్ని శకుంతల అనుభవాలుగా చూడటం వలననా? తన నెందుకింత నిర్లక్ష్యం చేసింది? శకుంతలని చూసినరోజు సృష్టిలోని తీయదనమంతా తనకోసరమే ననుకున్నాడు. కాని ప్రకృతి పామై కాటువేస్తుం దనుకోలేదు. కొన్ని కలలకి రూపమేగాని అర్థముండదు. ఇదీ అంతేనేమో? అతనిలో ఇచ్ఛ నశించిపోయింది.

రంగనాథం కళ్ళవెంబడి ఆఖరి కన్నీటిబొట్లు రాలిపోయాయి. అయితే ఇందులో శకుంతల తప్పేమీలేదు. అసలు పెళ్ళిచూపులకే ఒప్పుకోలేదు. ఇంట్లో నాలుగు రోజులు హోరాహోరీ యుద్ధం జరిగింది. చివరికి ఒకరాత్రి—

"నాన్నకి- అమ్మకి,


కనిపెంచిన మీరు మీ గుండెలమీద బరువు దించుకోవాలనుకుంటున్నారు. కాని ఈ విషయంలో ఒకసారయినా నాతో సంప్రదించలేదు. నన్నొక విగ్రహంలా అలంకరించి వారికి చూపారు. వాళ్ళు ఒప్పుకున్నారని తెలిసి పొంగిపోయారు. కాని నా మన స్సెంత గాయపడిందో మీకు తెలుసా? మీతో వాదించి ప్రయోజనం లేదు. నేనూ రాబర్ట్సు బి. ఏ. కలిసి చదువుకున్నాము. ఆ తర్వాత ఈ అయిదేళ్ళలో మరింత సన్నిహితమైనాడు. అతను క్రిస్టియన్ కావచ్చు. నాకు ఇవేవీ పట్టలేదు. అతను పరిపూర్ణమానవుడు. మా ప్రేమకి మతం అడ్డు రాలేదు. ఏ మతమైనా మనిషిని దేవుడ్ని చేయాలని చూస్తుంది. అది మనిషి హృదయంలోని మహత్తర అనుభూతి. మనిషి వ్యక్తిగత సమస్య.

ఈనాడు రాబర్ట్స్‌ని కాదని మరొకరిని చేసుకుంటే ఎవరం సుఖపడలేము. నేనలా ఆత్మవంచన చేసుకోలేను. నాకు రాబర్ట్స్ ఆరాధ్యదైవం. కాని మా ఇద్దరికీ వివాహం చేసేటంత సాహసం, సంస్కారం మీకు లేదు. లేదని నాకు తెలుసు. అందుకే వెళ్ళిపోతున్నాను. నా భవిష్యత్తు నేను చూసుకుంటాను. సంతోషించగలిగితే సంతోషించి ఆశీర్వదించండి. లేదా శకుంతల పుట్టలేదనుకుని తృప్తిపడండి. నాకోసరము ఎవరూ బాధపడవద్దు. మీరు తెచ్చిన సంబంధమే ఖాయమై రేపు ఒకవేళ ఎదైనా జరిగితే, 'దానికర్మ మన మేం చేస్తాం' అని తప్పించుకుంటారు. ఇప్పుడూ ఆ పనే చేయండి. రాబర్ట్స్ ప్రక్కనుంటే నా జీవితానికి పరిపూర్ణత ఏర్పడుతుంది. కన్న కూతురిగా అఖరిసారి తలుచుకుని క్షమించండి

—శకు.''

ఈ దెబ్బనుంచి చాలారోజులు కోలుకోలేదు రంగనాథం. అతని హృదయం నెత్తురుకన్నీరు కారుస్తూ విషాదంగా పాడుకుంటునే వుంది. దుఃఖం అతని జీవితంలో ఒక భాగమైపోయింది; శకుంతల అతనిలో శూన్యాన్ని నింపి మరీ వెళ్ళింది. అతని జీవితపుటలు చిరిగిపోయాయి. ఎప్పుడూ ఏదో వెలితి. అతని ఆత్మా మనస్సూ నీరసించి పోయాయి. కొన్నిగాయాలు ఎప్పటికీ మానవు. ఈ ఓటమిని భరించటం కష్టంగా వుంది. శకుంతల ఒక అరాధన, అనుభవ పరంపర, ఒక తీరని కోరిక, ఎడతెగని అన్వేషణ, అంతమేలేని ఆవేదన, నిరీక్షణ.

శకుంతలని తను మరచిపోలేదు. ఆమె తన నేనాడో మరిచిపోయింది. తనని గుర్తించలేదు. గుర్తించవలసిన అవసరం కూడా లేదు. ఆనాడే తన వునికిని, అహాన్ని, ఆనందస్వప్నాలను నిర్లక్ష్యం చేసింది. తన నిండుమనస్సు శకుంతలకి అక్కర్లేదు. ఇలా ఎందుకు చేశావని అడిగే హక్కు కూడాలేదు తనకి. శకుంతల పరాధీన.




అలా అని ఊరుకోలేకపోతున్నాడు. ఏదో ఆవేదన, ఏదో అశాంతి. తీరా శకుంతల రాబర్ట్స్ భార్య అని తెలిసినప్పటినుంచీ హృదయంలో ఏదో ఉద్వేగం. వాళ్ళిద్దరు తన కళ్ళముందే నాలుగేళ్ళ కొడుకు నెత్తుకుని నవ్వుతూ పోతూంటే హృదయంలో పిడుగులు పడుతున్నట్లే వుంది. మనస్సు నెవరో పిండుతున్నట్లే వుంది. వాసనలేని పువ్వయిన జీవితం వెక్కిరిస్తున్నది; వారి ఆనందం కాల్చివేస్తున్నది. అలా అని వారివంక చూడలేకపోతున్నాడు. శకుంతల కనపడినప్పటినుంచీ తన భావాలకు పిచ్చిపట్టినట్లుంది.

ఈ ఓటమినుంచి కోలుకునేటప్పటికి ఇంతకాలం పట్టింది. ఇప్పుడు మళ్ళీ శకుంతల కనపడింది. ఇది మంచికా చెడుకా? ఏమైనా శకుంతల ఇక్కడుంటే తను ఉండలేడు. పోగొట్టుకున్న వస్తువు విలువ ఎక్కువ. ఆమెలో ప్రమాదకరమైన ఆకర్షణ వుంది. ఆమెను నిర్మలంగా చూడలేడు తను. ఆ ఆకర్షణకి లొంగిపోతే? ఇన్నాళ్ళు తను కూడబెట్టుకున్న మంచితనం సర్వనాశనమైపోతుంది. తను మనిషిగాకూడా మిగలడు. తన కెలాగూ భవిష్యత్తు లేదు. ఇది కల, పీడకల, జీవితం నుంచి భవిష్యత్తుని విడదీసి తీరని అశాంతిని రేపిన కల, తన ఆశలని సమాధులుగా చేసిన కల.

గాలానికి చిక్కున్న చేపలా విలల్లాడింది మనస్సు.

నీటిబిందువుల్ని కావలిగా కప్పుకున్నయి కళ్ళు.

ఇదీ మొదలు. రాబర్ట్స్‌మీద శత్రుభావం ఏర్పడింది. శకుంతలమీది కోపం రాబర్ట్స్ మీద కేంద్రీకరించింది. శకుంతల భర్త అవటమే రాబర్ట్స్ చేసినతప్పు. దాన్నే భరించలేకుండా వున్నాడు.

రాబర్ట్స్‌ని ఎలా హింసించాలా అన్న ధోరణిలో వుండేవి అతని ఆలోచనలూ, చేతలూ. అతనికి అతికష్టమైన పనులు చెప్పేవాడు. అయితే ఎంతపని చెప్పినా విసుకు లేకుండా, అతి సునాయాసంగా చేసేవాడు రాబర్ట్స్. అలసటతో కూడిన చిరునవ్వు అతి మనోహరంగా అతని పెదవులమీద నాట్యం చేస్తూ వుంటుంది ఎప్పుడూ. అతని వ్యక్తిత్వంలో గొప్ప శక్తి వుంది. ఒక విధంగా తనకీ పనులన్నీ తెలియటం కోసరమే రంగనాథం మిగిలిన ఇంజనీర్లని

వదిలి తనకే ఇస్తున్నాడని అనుకునేవాడు. అతనిమనస్సు రంగనాథంపట్ల కృతజ్ఞతతో నిండిపోయేది. క్రమంగా ఈ అసంతృప్తీ, ఈ వెలితీ, కసీ రంగనాథంలో పేరుకు పోయాయి ఎంత హింసించినా అతని మనస్సు తృప్తిపడలేకపోతున్నది. రాబర్ట్సన పట్ల ఒకనాడు చూపిన అభిమానం నశించి పోయింది. రాబర్ట్సన అతని కంట్లో నలుసులా, కాలిలో ముల్లులా అయినాడు.

* * *

నిజానికి రాబర్ట్సన చాలా మంచివాడు :

ఇంకా ప్రాజక్ట్ నిర్మాణం ప్రారంభించ లేదు. కాని నిర్మాణం జరుగుతుందని తెలిసి కొందరు కూలీలు అప్పుడే వచ్చి గుడిసెలు వేసుకున్నారు. వారందరికీ రాబర్ట్సన మంచి తనం శ్రీరామరక్ష అయింది. రాబర్ట్సన వారికి దేవుడు. హరిలో ఐకమత్యాన్నీ, దైవ భక్తినీ పెంపొందచేశాడు. ప్రతిరోజు లేవగానే ఏకూలీఅయినా దేవుడిపటంముందు చేతులు జోడించి "భగవాన్, నాకర్తవ్యాన్ని నన్ను సరిగా నిర్వహించేటట్లు చెయ్యి.'' అని మరీ పనిలోకి వస్తాడంటే అది రాబర్ట్సన కృషి ఫలితమే.

మనిషికి క్షణంముందు ఏం జరుగుతుందో తెలియదు. తెలిస్తే రాబర్ట్సన ఈరోజు వెళ్ళ కుండా వుండేవాడు. ఈరోజు శకుంతల జీవితంలో దురదృష్టకరమైనరోజు. అతను ఉత్సాహంగా రంగనాథం పక్కనకూర్చుని జీపు డ్రైవ్ చేసుకుంటూ పోతున్నాడు.

రంగనాథానికి ముళ్ళమీద కూర్చున్న ట్లుంది. రాబర్ట్సన ఉనికిని భరించగలిచే స్థితిలో లేడు. ఏదో పిచ్చిపిచ్చిభావాలు కలుగుతాయి. రాబర్ట్సనుంచి వచ్చినగాలి వేడిగా సెగలు కక్కుతుంది. రాబర్ట్సన మాటలు ఋసలు కొడుతున్నాయి. అతన్ని చూస్తుంటే కసి ఎక్కువై పోతున్నది. అతని శరీరమంతా నిప్పుసెగలమీద వున్నట్లుంది.

కాని రాబర్ట్సనకిదేమీపట్టలేదు. అతనికి చాలా గర్వంగా ఆనందంగావుంది. ఒక ప్రాజక్ట్ నిర్మాణంలో తను ఒక ముఖ్యపాత్ర నిర్వహిస్తున్నాడు. ఇన్నాళ్ళూ బంజరుగా వున్నభూమి సస్యశ్యామలమౌతూంది అపుడు ప్రజలకు తను గుర్తుండక పోవచ్చు. కాని వారి ఆనందం చాలు తనకి. వారితృప్తి చాలు తనకి.

ఏమేం చేయాలో చెప్పుకుపోతున్నాడు రాబర్ట్సన. రంగనాథానికి మధ్య మధ్య జాలి కలుగుతున్నది. మళ్ళా కసి ఎక్కువ ఔతున్నది. ఈద్వైదీభావాలను ఆపలేకుండా వున్నాడు. అతనికి రాబర్ట్సమాటలు వినపించ లేదు. నల్లని మబ్బులు ముసురుకుంటున్న ఆకాశాన్ని చూస్తూ ఆలోచిస్తున్నాడు. అతని హృదయం బాధతో నిట్టూరుస్తున్నది. అతని మనస్సు భావాలరణరంగం అయింది.

మెలికలుతిరిగిన రోడ్డువెంబడి ప్రయాణం చేసి జీపు ఆగిపోయింది. రంగనాథం దిగి సిగిరెట్ వెలిగించాడు.

విపరీతమైన గాలి వీస్తున్నది, ఫెళ్ళున ఎగిరి ఆకాశపుటంచులను తాకి దొర్లుకుంటూ పొర్లుకుంటూ వచ్చి ఒడ్డునేవున్న శిలలను కౌగలించి ఛిన్నాభిన్న మౌతున్నయి కెరటాలు.

ఇక్కడ నది రెండు చిన్నకొండల మధ్యనుంచి ప్రవహిస్తోంది. నది వెడల్పు కూడా తక్కువ. అందుచేత రాకపోకల నిమిత్తం ఇక్కడొక వంతెన కట్టాలని నిర్ణయించారు.

''ఎంత బాగుంది సార్ ఇక్కడ-'' అన్నాడు రాబర్ట్సన నవ్వుతూ.

అతని చేతిలో లెవిలింగ్ ఇన్స్ట్రుమెంట్సు వున్నాయి.

చుట్టూ చెట్లు విపరీతమైన గాలికి గింజు కుంటున్నాయి. రాబర్ట్సన పాదాలముందు ఓ పిచ్చిమొక్క నేలకేసి తల బాదుకుంటూంది.

''కవిత్వం తరువాత; ముందు పని చూడు. మళ్ళీ వాన వచ్చేటట్లుంది,'' అన్నాడు రంగనాథం.

రాబర్ట్సన తల ఊపి "రండి" అన్నాడు.

ఇద్దరూ ఒడ్డుకు వెళ్ళారు.

ఆకాశంలో మబ్బులు గుమికూడి ఆత్రంగా చూస్తున్నయి. ప్రకృతి హెచ్చరికల్లా ఉరుములు మెరుపులు మొదలైనయి.

''పోనీ రేపు వద్దామా, వాన వస్తుందేమో?'' అన్నాడు రంగనాథం ఆకాశం వంక చూస్తూ.

"ఫరవాలేదు సార్, ఎన్నోమాట్లు ఇక్కడికి రావటం? మీరిక్కడే వుండండి, నేను వెళ్ళివస్తాను." అన్నాడు; పడవలోంచి తాడు తీసి చెట్టుమానుకు కట్టి వచ్చాడు.

''జాగ్రత్త రాబర్ట్స. సుడిగుండా లున్నాయి. పడవ నటు పోనీకు.''

''రోజూ పోతున్నాంగా సార్. అల వాటే. అయినా తాడుంది, ఒడ్డున మీరు ఉన్నారు - ఏం భయంలేదు,'' అన్నాడు పడవలో ఎక్కి.

రాబర్డ్స పడవ కదిలిపోతున్నది ప్రవాహాన్ని చీల్చుకొని. వాన మొదలైంది.

రంగనాథం వెనక్కి వెళ్ళి చెట్టుక్రింద నిల్చున్నాడు.

నది విపరీతమైన వేగంతో గర్జిస్తూ ప్రవహిస్తున్నది।

రంగనాథంమరోసిగరెట్ వెలిగించాడు.

తిరిగి అతనిలో శకుంతలని గురించిన భావాలు ముసురుకున్నాయి. అతనికి మన స్థిమితం లేకుండాపోయింది. అతనిగుండెల్లో భావాలు సంశ్లేషాత్మకమైనాయి. అవి పదనుగా, కరుకుగా హృద్యోకుడ్యాలను కోస్తున్నాయి. అతని గుండె బరువెక్కిపోతున్నది. రక్తం వేడెక్కిపోయింది. ఇన్నాళ్ళూ సూర్యకాంతిలా వెలిగిన మానవత్వం పొగజూరి పోసాగింది.

ఏదో పొందాలనే ఆకాంక్షలో జీవితం వ్యర్థమైపోయింది. ఇక సుఖపడలేడు. జీవితం అతన్నుంచి వేరైపోయి కన్నీళ్లు కారుస్తూ నిలబడ్డది.

రంగనాథం చేతిలో సిగరెట్ సురసుర కాలిపోతున్నది. అతనికి చుట్టూ ఏం జరుగుతున్నదో తెలియటంలేదు: వర్షం పెద్దది కావటం గమనించలేదు.

అతని మనస్సు గతాన్ని తవ్వుతున్నది.

తను శకుంతలని చూడటం, సంబంధం నిశ్చయం కావటం—శకుంతల తనని కాదని వెళ్ళిపోవటం — శకుంతలని తల్చుకుని నిద్ర లేకుండా గడిపిన రాత్రులు — అసంపూర్ణమై వెక్కిరించిన అన్వేషణ—వాడిన కోరికలు— జీవితంనిండా శూన్యము — అన్నీ తెరలు తెరలుగా క్రమ్ముకుంటున్నాయి. రాబర్ట్స్, శకుంతలా చేయిచేయి పట్టుకుని నవ్వుకుంటూ పోతున్న దృశ్యం అతని కళ్ళముందు మెదిలింది. అతని ముఖం జేవురించింది. గుప్పెళ్లు బలంగా మూసుకొన్నాయి. అతనిలో రాక్షసుడు లేచి కూర్చుని ఒళ్లు విరుచుకున్నాడు. అతని మనస్సు పాములపుట్ట అయింది. ఏదో విరాశా — నిస్పృహా — ఏదో అనుభవించాలని కొండంత ఆశపడ్డాడు. ఏదీ అనుభవించలేక నిస్సహాయుడై నిలబడ్డాడు. తనకోసరం కావాలని ప్రకృతి రసహీనమై పోయింది. తనలోని సౌందర్యాన్ని ఉపసంహరించుకుంది.

రంగనాథం చేతిలో సిగరెట్ వర్షానికి ఆరిపోయింది. దానివంక చూసి విసుగ్గా కిందపడేసి బూటుకాలితో నలిపివేశాడు.

తిరిగి గుండెల్లో మంట రగిలింది. అతని రక్తం సలసల కాగుతున్నది.


''సా—ర్, హెల్ప్ మి—'' ప్రకృతిని చీల్చుకు వచ్చింది.

రంగనాథం ఉలికిపడ్డాడు. వర్షపుచినుకుల తెరలగుండా చూశాడు. పడవ సుడిగుండంలో చిక్కుకున్నది. రాబర్ట్స్ పెనుగులాడుతున్నాడు. పడవ అతని స్వాధీనంలోంచి తప్పించుకొని గిరగిరా తిరుగుతున్నది. మధ్యమధ్య పడవ అటూఇటూ ఒరుగుతున్నది. నీళ్ళు విపరీతమైన వేగంతో పడవలో వచ్చి పడుతున్నాయి.

రాబర్ట్స్ పూర్తిగా తడిసిపోయాడు. అతను ప్రాణాపాయస్థితిలో వున్నాడు.

రంగనాథం చప్పున వొంగి తాడును పట్టుకున్నాడు. కాని —

కాని అంతలో అతనిలో రాక్షసత్వం వచ్చింది. ఇన్నాళ్ళూ అతనిలో పేరుకు




పోయిన అసంతృప్తి ద్వేషమై నరనరాల్లోనూ వ్యాపించింది. ఈర్ష్యా అసూయా క్రూరత్వం రక్తంలో కలిసిపోయినై. అతని గుండెల్లో శకుంతల తనని చూసి పరిహాసంతో విరగబడి నవ్వుతున్నట్లే అనిపించింది. అతని మనస్సు ద్వేషపు ఆవిరితో నిండిపోయింది. ఎన్నాళ్ళు రాబర్ట్స్ని హింసించినా తృప్తి పడని పశుప్రవృత్తి ప్రజ్వరిల్లింది— దాహంతో ఎదురుచూసింది. అతనిలో మానవుడు తల్లక్రిందులైనాడు.

శకుంతలని తనకు దక్కకుండా చేసిందెవరు ?

రాబర్ట్స్!

తను పొందలేని ఆనందాన్ని వాళ్ళెందుకు పొందాలి? రాబర్ట్స్ లేకపోతే శకుంతల తనకు దక్కేదే.

ఈ రాబర్ట్స్ లేకపోతే—?

అతనిలో రాక్షసుడు వికృతంగా నవ్వాడు.

అవును. ఇదే మంచిసమయం. ఈ అవకాశం రాదు. ఇక్క డెవరూ లేరు. నిన్నెవరూ అనుమానించరు. సంఘం నీకు మంచివాడని కిరీటం పెట్టింది. అది నిన్ను కాపాడుతుంది—" రాక్షసుడు చెప్పుకుపోతున్నాడు.

"వద్దు. అది పాపం—'' ఆత్మ ఎదురు తిరిగింది.

రాక్షసుడు విరగబడి నవ్వాడు. ప్రకృతి—ఆత్మ బ్రద్దలైంది.

"పాపమంటే ఏమిటి? మనిషి పెట్టుకున్న నియమం. మనిషి తన చుట్టూ గీసుకున్న గిరి. ఎవరూ చూడకపోతే ప్రతివారూ ఆ పరిధిని దాటుతారు. అందుచేత పాపం—అనే దానికి సహజమైన విలువలేదు. నిన్నింత బాధపెట్టిన శకుంతల, పాపం గురించి ఆలోచించలేదే? నిన్ను, ఎవరిని చూసి శకుంతల ప్రేమించలేదో వారిని ద్వేషించు. ఆనాడు నువ్వు పొందలేని ఆనందాన్ని ఈనాడు నీ శత్రువుని నిర్మూలించి పొందగలవు.''

రంగనాథం ముఖం కోపంతో నిప్పులు క్రక్కింది. అతను తన ఆనందాన్ని, స్వార్థంలోంచి, ద్వేషంలోంచి అన్వేషించటం మొదలుపెట్టాడు. అందువలన అతని లక్ష్యం వినాశంతో కూడుకుంది.

''మరొకసారి ఆలోచించు. నువ్వు మంచివాడివి—'' ఆత్మ కొనవూపిరితో అంది.

పొగచూరిపోయిన మానవత్వం తన నిజస్వరూపాన్ని పొందలేకపోయింది. అచేతనంగా వుండిపోయింది. రాక్షసుడు అతవి మేధని పైకి రానీయకుండా కాలితో అదిమిపెట్టాడు.

"సా—ర్—హె—ల్ప్—మి—సా—ర్—" రాబర్ట్స్ అరుస్తున్నాడు.

వ్యక్తినిబట్టి నైతికసూత్రాల విలువలు మారుతున్నాయి. నువ్వు సంఘానికి మంచివాడివి కావాలంటే నీకు నువ్వు భయపడాలి. నీ ఆనందాన్ని నువ్వు పొందటం పాపం కాదు.''

రంగనాథం మనస్సులో రాక్షసుడు బుసలు కొడుతూ చెబుతున్నాడు. ఆ రాక్షసత్వం అతని సర్వాంగాల్లోనూ వ్యాపించింది.

ద్వేషం ఎక్కువైపోయినప్పుడు మనిషి న్యాయాన్యాయ విచక్షణని కోల్పోతాడు. దయాదాక్షిణ్యాల అర్థం మరిచిపోతాడు. తన మానవత్వాన్ని తనే హత్య చేస్తాడు. అయితే ద్వేషంతోకూడిన ఈ అనుభూతిలో సత్యం లేదు; సౌందర్యం లేదు.

"రాబర్ట్సని లేకుండా చేయడమే నీ ధ్యేయం!" రాక్షసుడు గర్జించాడు.

రంగనాథం ముఖం మలినమైంది. అతని హృదయం గడ్డ కట్టింది. అంతరాత్మ ఆఖరి వెలుగుని ప్రసరించాలని ప్రయత్నించి ఓడి పోయింది. అతనికి ఊపిరాడటంలేదు. అతనిలో క్రూరత్వం పరకాష్ట నందుకుంది.

"ప్రేమించని వాళ్ళని ద్వేషించు. నీ శత్రువు రాబర్ట్స - నీ వస్తువును నీకు కాకుండాచేసింది రాబర్ట్స. నీ హృదయాన్ని చిత్రవధచేసింది రాబర్ట్స. ఆనాడు నువ్వు వెయ్యిసార్లు మరణించావు మానసికంగా. నీ బాధ నెవరు పంచుకున్నారు? అసలు నిన్నుచూసి ఎవరి హృదయం ద్రవించింది? పైగా, నిన్ను చూసి పరిహసించారే? నీకు మన సుంటుందని గ్రహించిందా శకుంతల? గాజుపాత్ర లాంటి నీ బ్రతుకుమీద రాయి విసిరి తనదారిన తాను పోయింది. నీబ్రతుకు బ్రద్దలైపోయింది. నీ ఆశలు భస్మరాసులుగా మిగిలి పోయాయి:" రంగనాథం ఆత్మకు సంకెళ్ళు తగిలిస్తున్నాడు రాక్షసుడు. తన బానిసని చేసుకున్నాడు,

రంగనాథం ఇక్కడే పొరబడ్డాడు. అతనికి తనని తాను నిర్వచించుకోవటం తెలియదు. ఒక క్షుద్రఆవేశం. ఉద్రేకం అతన్ని రెచ్చగొట్టినయి. ద్వేషాగ్నిని హృదయంలో నింపినయి. అతని వివేకం నశించిపోయింది. తనని శకుంతల అన్యాయం చేసిందని బాధే తప్ప తను శకుంతల కేం చేస్తున్నాతో ఆలోచించలేక పోయాడు. చదువూ సంస్కారం అడ్డు పడలేకపోయాయి. శకుంతలను తనెలా ప్రేమించాడో అలాగే ఆమె మరొకర్ని ప్రేమించగలదని అతనికి తోచలేదు. కరుడు గట్టిన ద్వేషం అతనికి వ్యవధి ఇవ్వలేదు. అసంతృప్తిచాటున దాక్కుని ఎన్నాళ్ళనుంచీ ఈ అవకాశంకోసం ఎదురు చూస్తున్నాడో? అతను జ్ఞానదరిద్రుడైనాడు. ప్రేమించటం, మొక్కకి నీళ్ళుపోసి పూలు పూయించటం వంటిది. ఆపూలవాసన జగత్తంతా వ్యాపిస్తుంది. ద్వేషించటం ఆ మొక్కని సమూలంగా పెకలించివేయటం వంటిది. అప్పుడు ఆమొక్క వడలిపోతుంది.

రంగనాథాన్ని రాక్షసుడు హిప్నటైజ్ చేశాడు. రంగనాథం పూర్తిగా లొంగిపోయాడు. ఒంగి వణుకుతున్న చేతులతో తాడు ముడిని ఊడదీశాడు. కాలసర్పంలా బుస్సుమని జరజరా పాకి పోయింది తాడు.

రంగనాథం చరిత్రహీనుడై నిలబడిపోయాడు.

రాబర్ట్స పడవని స్వాధీనంలోకి తెచ్చుకోవాలని వృధాప్రయత్నం చేశాడు. కాని ప్రవాహవేగానికి పడవ వూగిపోతున్నది. నీళ్ళు పడవలోకి వచ్చి పడుతున్నయి. రాబర్ట్స అలసిపోయాడు. పొగమంచులా మృత్యువు అతన్నావరిస్తున్నది. అతను రంగనాథం సహాయంకోసరం ఎదురుచూశాడు. రంగనాథం వొంగినప్పుడు తనకు సహాయం చేస్తున్నాడని అనుకున్నాడు. కాని తాడు విప్పేయటం కనిపించింది లీలగా. అతని హృదయం కంపించింది.

ఏమి టిది? ఏం చేశాడతను?



ఏమో, ఆలోచించే అవకాశంలేదు. ఇది ఆఖరినిముషం, అతని మేధ మొద్దుబారిపోయింది. కుప్పకూలిపోయాడు. అతని కళ్ళకి శకుంతల కొడుకు జేమ్స్, క్రీస్తూ కనిపించారు.

"ఓ ప్రభూ! వాళ్ళని రక్షించు. నా ప్రతిఅనుభవంలోనూ నా తోడు నీడయి, జీవితమై, నాకోసరం తన సర్వస్వాన్నీ త్యాగం చేసిన శకుంతలని రక్షించు. వారికి నీవే దిక్కు. ఇంతకంటే ఏమీ వద్దు. నేను సంతోషంగా నీదగ్గరికి వస్తాను.





రాబర్ట్సు మౌనంగా ప్రార్థించాడు. అతని గుండెల్లో బైబిల్ పుటలు తిరిగినయి.

అతని మనస్సులో జీవితం చర్వితచర్వణం అయింది. ఇంత వరకూ అసంతృప్తి పడలేదు తను. అశాంతి లేదు. జీవితంలో పరిపూర్ణతని సాధించాడు. తన వ్యక్తిత్వం సంపూర్ణమైనది. తన అనుభవాలు సమగ్రమైనవి. తనని ఏసు ఆశీర్వదించాడు– అదృష్ట వంతుడు తను.

ప్రతివారినీ భగవంతుని ప్రతిరూపాలుగానే చూశాడు. నిండు మనస్సుతో ప్రేమించాడు. తనకు దేవునిపిలుపు వినపడింది.

ఇక భయ మెందుకు మరణమంటే? ఎప్పటికైనా తప్పని దానికి బాధెందుకు?

జీవించటం కూడ ఒక లీల.

రాబర్ట్సు మృత్యుంజయుడైనాడు. అతని ముఖాన చిరునవ్వు వెలిగింది.

అతనితో మృత్యువు ఆడుకుంటున్నది. పడవలో నీళ్ల గలగల నవ్వుతున్నాయి.

రాబర్ట్సు ఆఖరిసారిగా రంగనాథం వంక చూశాడు.

తప్పు చేయటం మానవసహజం. కాని దాన్ని క్షమించగల గటం దైవత్వం.

"తండ్రీ! అతన్ని క్షమించు. అతనేం చేస్తున్నాడో అతనికే తెలియదు," అన్నాడు నిండుమనస్సుతో.

అతనికి తన జీవితం, ఆత్మ, క్రీస్తు ఒకే సరళరేఖలో కనిపించారు.

చర్చిలో గంట మ్రోగింది.

ఆకాశంలో మెరుపు మెరిసింది. అతని ఎదురుగా విద్యుల్లత క్రీస్తుకుమల్లే కనిపించి ఆశీర్వదించాడు.

ఈ ప్రేమతో అతని ఆత్మ పరిశుద్ధమైంది. ఆకాశం, చూడలేక మబ్బుల చేతులతో ముఖం కప్పుకుంది. ఒక మంచివాడి స్పర్శకు పులకించిన నది ఆవేశంతో పడవలోకి వస్తున్నది.

కోపంతో, అసహ్యంతో వర్షం రంగనాధాన్ని బాదింది. శకుంతల ఇంట్లో క్రీస్తు ముందు పెట్టిన మైనపువత్తి ఆరిపోయింది. శకుంతల భయంగా చూసి, కొడుకును దగ్గరకు తీసుకుంది. ఎందుకో ఆమెకు కన్నీరు వచ్చింది.

తాడు విప్పేయటంతో పడవకి విముక్తి వచ్చింది. ఆనందంతో గంతులు వేసింది.

రాక్షసుడు విజయగర్వంతో రంగనాధం హృదయసింహాసనంమీద కూర్చున్నాడు.

రాబర్ట్సు నిశ్చలంగా కూర్చున్నాడు. అతని మనస్సు ప్రార్థన చేస్తున్నది. మృత్యువు అనంతత్వానికి అతని చేయి పట్టుకుని దారితీసింది. భగవంతుడు వేలితో అతన్ని స్పర్శించాడు. రాబర్ట్సుకి అయోమయమైపోయింది. అతనికి నిద్ర ముంచుకు వచ్చింది. కాలపుటంచున నడుస్తూ వెళ్ళిపోతున్నాడు అతను!

'సార్, గుడ్‌బై' అదే ఆఖరి వీడ్కోలు.

యుగయుగాలుగా అతను చేస్తున్న పురోయాత్రలో ఒక మజిలీ ముగిసింది.

రంగనాధం ప్రాణం స్తంభించింది. అతని మనస్సు మరణించింది. కాళ్ళక్రింద భూమి కంపించింది. ఒక్కసారి నిద్రలోంచి మేల్కొన్నాడు.

'రాబర్ట్సు' అని అరిచి పడిపోయాడు.

అతనికి స్పృహ తప్పిపోయింది. వర్షానికి తడిసిన జీపు తన సర్వాంగాలతో కన్నీరు కారుస్తూ దీనంగా నిలబడిపోయింది.

'నా చెప్పిన చొప్పున నడిచినవాడు చిరంజీవి.

— క్రీస్తు.

* * *

రాబర్ట్సు మరణించి వారం రోజులు దాటింది.

శకుంతల ఇష్టప్రకారం ఆ కొండల దగ్గిరే అతన్ని సమాధి చేశారు.

ఈ వారం రోజుల్లో రంగనాధం మామూలు మనిషయినాడు. అతని హృదయంలోని విషవాయువులు చల్లబడుతున్నాయి. అయితే అతనిలో ఏదో మార్పు బయటకు రావాలంటేనే భయం. ఆ భయానికి అర్థం లేకపోలేదు. ప్రకృతిని చూస్తే ఆవేదన. ఎక్కువకాలం గదిలోనే గడుపుతున్నాడు. అయితే అది ఇంకెవరికైనా సాధ్యమేమో కాని, రంగనాధంలాంటివారికి కాదు. అతని వృత్తిధర్మమే అడ్డువచ్చింది. కప్పను తిన్న పాములా అయినాడు. ప్రపంచం రంగనాధాన్ని అనుమానించలేదు. అది యాక్సిడెంటు అనే అనుకుంది. సంఘం అతని బాహ్యజీవితాన్నే చూసింది. అతని హృదయం దానికి తెలియదు అతని ప్రవర్తన అసహజంగా వున్నా. అది రాబర్ట్సు మరణం కళ్ళారా చూడటం వలననే అనుకున్నారు. రాబర్ట్సు అంటే రంగనాధం ఎంత అభిమానించేవాడో చెప్పనక్కర్లేదు! అతను పైకి రావటానికి ఆయన ఎంత చేయాలో అంత చేశాడు. కాని_

రంగనాధం కళ్ళుమూసుకుని కూర్చున్నవాడల్లా చటుక్కున లేచాడు. అతని కాళ్ళు శకుంతలగారింటికి దారి తీసినయి.

"లోపలికి రండి. అమ్మగారు ప్రార్థన చేసుకుంటున్నారు," అన్నాడు హనుమంతుడిలాంటి నౌకరు.

శకుంతల క్రీస్తుముందు మోకరిల్లింది.

మూర్తీభవించిన శోకదేవతలా వుంది ఆమె. ఆమె ముఖం హేమంతంలో పద్మంలా వుంది. దుఃఖమంతా ఆమె కట్టుకున్న నల్లని చీరలోనే వుంది. ఆమె జీవితంలో ఆనందానికి శాశ్వతంగా క్షామం వచ్చింది. ఆమె ప్రక్కనే జేమ్సు కూర్చుని వేలితో నేలమీద అర్థంలేని పిచ్చిగీతలు గీస్తూ, రంగనాధాన్నీ, తల్లినీ మార్చిమార్చి చూస్తున్నాడు. అతని అమాయకమయిన చూపులు సత్యంలా రంగనాధం హృదయాన్ని కోస్తున్నాయి. మౌనంగానే దేవుడిలా సంజాయిషీ అడుగుతున్నాడు. రంగనాధం హృదయం నిట్టూర్చింది. అతను లోపలికి వచ్చి ఒక కుర్చీలో కూర్చున్నాడు. అతని చూపులు టేబుల్‌మీద వున్న డైరీమీద పడినయి.

తీసి చూశాడు.

'భగవంతుడు హార్మోనియం వంటివాడు ఎవరు ఏరీడ్ నొక్కితే ఆ స్వరమే పలుకుతాడు.'

'ఒకే విద్యుచ్ఛక్తి రంగురంగుల దీపాలను వెలిగించినట్లు, ఒకే దైవత్వం మతాలన్నిటిలోనూ వుంది. మనిషి లక్ష్యం ప్రేమించటమే. ప్రేమ ఎక్కడుంటుందో దేవుడు అక్కడే వుంటాడు.'

రంగనాధం హృదయం ద్రవించ సాగింది.

'నీ శత్రువుల్ని ప్రేమించు. నిన్ను హింసించేవారికై ప్రార్థించు. దుష్టత్వాన్ని ప్రతిఘటించకు.'

రంగనాధానికి మతిపోయినంత పనైంది.

రాబర్ట్సుని లేకుండా చేశాడు. కాని దానివలన కలిగిన ప్రయోజనమేమిటి? రాబర్ట్సు లాంటివాళ్లు అమృతులు. అతని చావు శారీరకంగా మాత్రమే. నిజానికి తనే అతన్ని మర్చిపోలేకుండా వున్నాడు. అప్పటికన్నా ఇప్పుడే శాంతితో బ్రతకలేకపోతున్నాడు.

రంగనాధం కళ్ళు మూసుకున్నాడు.

అతని గుండెల్లో కాలం మండిపోతున్నది. చైతన్యం విలుప్తమవుతున్నది.

"నమస్కారం'' అంది శకుంతల. ఆమె గొంతు వణుకుతున్నది.

రంగనాధం కన్నీటి యవనికగుండా చూశాడు. ఆనాడు చూసిన శకుంతలకీ ఈ శకుంతలకీ భేదంలేదు. శకుంతల మారలేదు. ఆనాడు శకుంతల భవిష్యత్తును ఆలోచించింది. ఇప్పుడు గతాన్ని ఆలోచిస్తున్నది.

''నీకు చాలా అన్యాయం జరిగిపోయింది. పాపం, రాబర్ట్సు అల్పాయుష్కుడు "

'ఇంకా అహం చావలేదు – రాబర్ట్సుని చేసుకోక పోతే ఇలా జరిగివుండదు' అన్నట్లు ధ్వనించాయి.

శకుంతల జాలిగా నిట్టూర్చింది.

"ఏం చేయాలో ఆ భగవంతుడికే తెలుసు. వరమిచ్చినా, శాపమిచ్చినా మన మంచి కోసరమే. దాన్ని స్వీకరించటమే మన వంతు."

రంగనాధం గొంతు మూగబోయింది.

జీవితంలో నటించటం మొదలైంది. తన జీవితానికి, తన వ్యక్తిత్వానికి కృత్రిమపు విలువలు ఆపాదించుకున్నాడు.

''రాబర్ట్సు నా తమ్ముడులా వుండేవాడు. అతను లేని లోటు ఎవరూ తీర్చలేరు. నా కుడిచెయ్యి పోయినట్లు వుంది.''

శకుంతల బాధగా తల దించుకుంది.


''మీకే అలా వుంటే నా కెలా వుండాలి. అతను నా తోడు, నీడ, నా సర్వస్వం: నా ఆరాధ్యదైవం. హద్దులులేని మంచితనమే అతను. ఇంతకాలం నాతో ప్రయాణం చేసి హఠాత్తుగా వదిలి వెళ్ళిపోయారు. నా దురదృష్టం. ఒంటరితనానికి మించిన శిక్ష ఏముంటుంది? మా ఇద్దరి మధ్యా వున్న పవిత్ర బంధానికి ప్రతిరూపం వుంది. దాన్ని చూసుకుంటూనే బ్రతకాలి. వీడే లేకపోతే ఏనాడో ఆయన్ని అనుసరించివుందును.''

శకుంతల కళ్ళవెంబడి కాలువలు ప్రవహించాయి.

రంగనాధం అక్కడ కూర్చోలేక పోయాడు.

అతని కిప్పుడుకూడా ఊపిరాడటంలేదు. ముఖ్యంగా జేమ్స్ ముఖం చూడటం కష్టంగా వుంది.

"ఏం చేస్తారింక? మీవాళ్ళెవరైనా వున్నారా?"



శకుంతల చాలాసేపు మాట్లాడలేదు.

"ఉన్నారు - లేరు. నాకు వాళ్లు వున్నా. వాళ్ళకి నేను లేను. అయినా నేనక్కడికి పోదలుచుకోలేదు. ఆయనకీ ప్రదేశమంటే ఇష్టం. అందుకే ఇక్కడే సమాధి చేయమన్నాను. ఇక్కడే వుండి ఆయన వదిలిన పని నిర్వహించటమే నాకర్తవ్యం. నాకింకేకోరికా లేదు."

రంగనాథం అర్థం కానట్లు చూశాడు.

"ఆయన ప్రతిరోజూ అంటూవుండేవారు. ఎప్పటికైనా మా అబ్బాయిని మీ అంత ఇంజనీరుని చేయాలని; అంతకన్నా మీలాంటి మనిషిగా చేయాలని. మీవంటి మహాపురుషులు అరుదుగా భూమిమీద అవతరిస్తుంటారు. మీరు నా స్వంత అన్నయ్యలాంటివారు. మీ సలహాలూ సహకారం వుంటే నా లక్ష్యం నెరవేరుతుంది. కాదంటారా? నేనిక్కడే వుంటే ఏమైనా అభ్యంతరమా?"

ఆమె కళ్ళల్లో క్రీస్తుముందు వెలిగించిన మైనపువత్తులు నక్షత్రాల్లా ప్రతిఫలించినయి. ఆమె ముఖంనిండా ఆ పవిత్రకాంతి అలుముకుంది.

రంగనాథం హృదయం ఆ క్రొవ్వొత్తుల వేడికి కరిగిపోతున్నది. ఏమిటిది? ఏం జరుగుతున్నది? ద్వేషానికి ప్రతీకారం ప్రేమించటమా?

అతనిలో నిద్రించిన మేథ మేల్కొన్నది.

"నాకేమీ అభ్యంతరం లేదు."

శకుంతల భారంగా నిట్టూర్చింది.

"ఆ దైవ సన్నిధి. మీ గురించే ఎక్కువగా వుంది. ఇక్కడికి వచ్చినతరువాత వీడు పుట్టివుంటే మీ పేరే పెట్టేవారు."

రంగనాథం తల తిరిగిపోయింది.

అతనిలో పశ్చాత్తాపం మొదలైంది.

"మూర్తీభవించిన మంచితనం రంగనాథంగారు. మనిషిలో సత్యము, శాంతి, ప్రేమ, అహింస, నిష్కామత్వము ఎక్కువైనప్పుడు మనిషే దేవుడైపోతాడు. రంగనాథంగారు అలాంటివారు. ఎంతో కష్టమైన పనులుకూడా నాకే అప్పచెబుతున్నారంటే, ఆ పనులన్నీ నాకు తెలియటంకోసరమే. మనుష్యులు పుడతారు, మరణిస్తారు. కాని రంగనాథంగారు చిరంజీవులు. యుగాలు గడిచినా వారి వ్యక్తిత్వంతో మనలో నిలిచే వుంటారు."

రంగనాథం హృదయంలో వెచ్చని ఆవిరి బయలుదేరి నరనరాన్నీ ఆవహించింది. అతని మనస్సు కంపించిపోయింది. అతని గుండె దడదడ లాడింది.

"నాశనానికి పోయేదోవ వెడల్పు. చాలా మంది పోతున్నారు దానివెంట. కాని సత్య జీవితానికి తీసుకుపోయే మార్గం ఇరుకు, సన్నం. దాన్ని కనుక్కునేవారే కొద్దిమంది." (నిర్వికల్పం)

రంగనాథం మనస్సు కమిలిపోయింది. ముఖం నల్లబడింది.

ఆనాడు తలలో చేరిన దుష్టత్వం ఏం చేయమని ప్రోత్సహించిందో, ఏం చేశాడో, ఇప్పుడు తలుచుకుని సిగ్గుతో కుమిలిపోతున్నాడు. తల ఏరాయికన్నా కొట్టుకుంటే బాగుండు! అతనిమనస్సు భారాన్ని మోస్తున్నట్లుగా క్రుంగిపోయింది.

సత్యం నిప్పులాంటిది; భయంకరమైనది. ఆ సత్యం ఆలస్యంగా అతని హృదయంలో వెలిగింది. ఆ వేడికి అతనిలోని అసత్యం, మాలిన్యం మండిపోతున్నయి. అతని హృదయం హోమకుండమైంది. భావాలు సమిధల్లాపడి మండుతున్నయి. మనుష్యులు, మమతలు_వీటివిలువ ఇప్పుడు తెలుస్తున్నది. ప్రేమఅంటే ఆత్మార్పణ. మతంతో నిమిత్తం లేకుండా శకుంతల ఆత్మార్పణ చేయగలిగింది. అందుకే రాబర్ట్సని భౌతికంగా పోగొట్టుకున్నా, మానసికంగా పొందగలిగింది. రాబర్ట్సలో మతం మానవత్వానికి దోహదం చేయగలిగింది. ఇంతకన్నా గొప్పలక్ష్యం ఏముంటుంది? మతానికి గాని, మనిషి జీవితానికి గాని మూలం ధర్మం. మనిషివలన ధర్మానికి హాని కలిగితే ధర్మం సహించలేదు. మనిషి మనుగడ సాధించలేడు.

మనిషి కోరుకోవల్సింది సర్వమానవ కల్యాణంగాని, వ్యక్తిగత ఆనందంకాదు.

రంగనాథంలో ఆత్మవిమర్శ ప్రారంభమైంది. తను మంచివాడే. కాని దానిలో నిజాయితీలేదు. నిజాయితీలేని సత్ప్రవర్తన ప్రాణంలేని అందమైన స్త్రీలాంటిది. దానికి విలువలేదు.

రంగనాథం కళ్ళు మూసుకున్నాడు.

ద్వేషం — ప్రేమ.

ఒకే మనస్సుయొక్క రెండు అవస్థలు_ రెండు శక్తులు.

ఈర్ష్య, అసూయ, స్వార్థం, మతం, ఆర్థికవ్యవస్థ, వర్ణవ్యవస్థ_ ఇవన్నీ మనిషినీ మనిషినీ విడదీసినయి. మనిషి లక్ష్యంమీద బలమైన దెబ్బకొట్టినయి. ఆత్మ చచ్చుకి. దానిమాటను విననివ్వకుండా చేసినయి. మనిషి తన కుక్కగొడుగులవంటి కోరికలతో భవిష్యత్తును చూడటమే కారణం.

మనిషిని ప్రేమించటం మనిషికి చేతకాదా?

రంగనాథం కళ్ళు చెరువులైనై. అతని అహం రాబర్ట్సచుట్టూ తిరుగుతున్నది. ఈ అనుభూతి విచిత్రమైనది. అతనిలో స్వార్థం చచ్చిపోతున్నది.

అతని ఆత్మ ఏడుస్తున్నది. అదృష్టవశాత్తూ ఆభావాలకు స్వరంలేదు, ఆ కన్నీటికి భాషలేదు.

శకుంతల రంగనాథాన్ని జాలిగా చూస్తున్నది.

'ఎంత బాధపడుతున్నాడీయన!'

"రాబర్ట్స! నిన్ను ప్రేమించనివాడు దురదృష్టవంతుడు! అయ్యో, ఈసత్యం ముందే ఎందుకు తెలియలేదు_" రంగనాథం తల బాదుకున్నాడు.

"బాబుగారు!"

రంగనాథం కన్నీరు తుడుచుకొన్నాడు.

కాని అక్కడుండలేకపోయాడు.

ఒకసారి జేమ్సనీ, శకుంతలనీ, రాబర్ట్స

ఫొటోనీ చూసి, 'వస్తానమ్మా' అని వెళ్ళి పోయాడు !

* * *

నటించటం చేతకాలేదు రంగనాధానికి.

కళ్ళు మూసినా తెరిచినా రాబర్ట్సు కని పిస్తున్నాడు.

ఈ ప్రపంచం - మనిషిలోని అతి మంచి తనాన్ని కూడా భరించలేదు - అతన్ని ఏకాకిని చేసి తన శత్రుత్వాన్ని ప్రకటిస్తుంది.

రంగనాధం దిగులుగా వెళ్ళి రాబర్ట్సు సమాధిముందు కూర్చున్నాడు. అతన్నుంచి వేరైపోయిన పాపం నల్లగా చీకటిగా విశ్వాన్నావరించింది. ఆ చీకటి మనస్సులా కూర్చున్నాడు.

**ఆ**కాశంలో నక్షత్రాలు తమ వాడి చూపులతో అతని ఆత్మని గ్రుచ్చుతున్నయి. అతని శరీరంలోని అణువణువూ రాబర్ట్సు కోసరం ఆక్రోశించింది.


"రాబర్ట్స్ ! నన్ను క్షమించగలవా ?" అన్నాడు ఏడుస్తూ.

నిజంగా రాబర్ట్సు ఏనాడో అతన్ని క్షమించాడు. ఎదుటిమనిషిలోని చెడుని స్వీకరించి మంచివాడినిగా చేయగలిగినంత మంచివాడు రాబర్ట్సు. అంత దయామయుడు. చంపదగ్గిన యట్టిశత్రువు తనచేత చిక్కినాకూడ కీడు చేయనంత క్షమామూర్తి. అదే రంగనాధానికి గొప్పశిక్ష అయిపోయింది. ఒక మనిషిలోని చెడుని గుర్తించట మంటే తను చెడ్డవాడైపోవటమే. మనిషి నైతికపతనమే పాపం.

పాపం, అతని ఆత్మచుట్టూ నగా వలయములా గూడు కట్టింది. విషంలా అతని సర్వావయవాల్లోనూ వ్యాపిస్తున్నది.

ఎందు కీ క్రూరత్వం మనిషిలో ?

మనిషి మరణించేటప్పుడు ఎంత బాధపడతాడో అల్పప్రాణి ఐన చీమ మరణించేటప్పుడూ అంతబాధ పడుతుంది. కాని చీమ అందుకున్న దైవత్వపు పొలిమేరలుకూడ మనిషి అందుకోలేకపోతున్నాడు. మనిషికి మేధ నిచ్చినందుకా దేవుడి కీ శిక్ష ?




రంగనాధంలో వ్యధ పరకాష్టనందుకుంది. సమాధిముందు అతని వేదనని నివేదన చేశాడు. ఆత్మార్పణ చేశాడు. పశ్చాత్తాపంతో అతని జీవితమే దహించుకుపోతున్నది. రాబర్ట్సు ఆనాడు పిలిచిన పిలుపులు 'సార్ హెల్ప్ మీ' తిరిగి వినబడుతున్నయి. హృదయాన్ని శూలాల్లా గ్రుచ్చుతున్నయి.

ప్రకృతి నిశ్శబ్దంగా అతని వ్యధని వింటున్నది !

రంగనాధం కన్నీటికి ప్రాణం వచ్చింది. అతని మనసుని నిర్మలం చేసింది.

'ఒరులే యవి యొనరించిన
నరవర యప్రియము తనమనంబునం దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మపథముల
కెల్లన్.'

ప్రకృతి మనస్సులో చదువుకుంది.

ఎప్పుడో ఒకనాడు ద్వేషంతో అతన్నావేసించిన దానవత్వాన్ని మానవత్వం జయించింది. రాబర్ట్సు ప్రేమలో దైవత్వం వుంది. అదే రంగనాధాన్ని మనిషిగా చేసింది. అతనిలోని ద్వేషం, ఈర్ష్యా, అసూయలన్నీ నశించిపోయినయి. అతని హృదయం శూన్యమయింది. ఆ శూన్య మైన హృదయంలో జరిగిం దంతా విష దంగా మెదిలింది. పశ్చాత్తాపం కలిగింది జీవితం తెగిన గాలిపటం అయింది.

ఈ చీకటిలో ఏకాకి అయిన రంగన ధాన్ని అతని మనస్సే న్యాయాధికారి అయి న్యాయవిచారణ జరుపుతున్నది. అతన ముద్దాయి అయినాడు. ఈ పాపానికి పశ్చా త్తాపంతో సరిపోతుందా ? ఈ కన్నీళ్ళ గుండెలోని అగ్నిపర్వతాలను చల్లార్చ గలవా? చాలదు. శిక్ష కావాలి. మంచికి ప్రతి ఫలం లేకపోయినా పరవాలేదు. చెడుకి శిక్ష వుండితీరాలి. చేతులు కాల్చుకుని, మండ తున్న చేతులు చూసుకున్నాడు రంగనాధం

జీవితంలో యాధార్థం బోధపడలేద ఇన్నాళ్ళూ. తను వ్యక్తినీ, జీవితాన్నీ వేర చేసి చూశాడు. అందుకే ఓడిపోయాడు పాపాత్ము డైనాడు.

రంగనాధంలో పశ్చాత్తాపం పరకాష్ట నందుకుంది; అతని మనస్సు ఆక్రోశిస్తు న్నది. ఈ ప్రపంచలో త నొక్కడే దుర్మా ర్గుడు. తను తప్ప మిగిలినదంతా పవిత్ర మైనది. దుష్టత్వం తనలో కరుడుగట్టింది తనకు శీలంలేదు. తనకోసం ఈ ప్రకృతి

సృష్టింపబడిందని స్వార్థంతో ఆలోచించాడు. తనలో ద్వేషం వెల్లువలా పెల్లుబికింది. తను జ్ఞానదరిద్రుడైనాడు.

రంగనాథం కళ్లు వర్షిస్తున్నాయి. ఆ అశ్రుమాలకి 'అంతంలేదు.

అతని హృదయం రాబర్ట్సుమీద జాలితో నిండిపోయింది – అతని వ్యక్తిత్వం బీటలు వారిపోయింది.

రంగనాథం ఆత్మ మనస్సు శరీరము అలసిపోయినయి. అతని ముఖం పాలిపోయింది. గుండెబరువు ఎక్కువైంది.

ఎలా ఈ పాపానికి పరిహారం ?

ఒకటే మార్గం. తను ఈ లోకంనుంచి వెళ్ళిపోవాలి. అసలు ఇంకా జీవించటం సాధ్యమా తనకు? అంతరంగంలో ఏకాకి అయినాడు తను. ఈ అంతర్వేదనని భరించటం సాధ్యంకాదు. తనలాంటి దుర్మార్గుడికి భగవంతుడు సహాయం చేయడు. తనని దీవించడు.

రాబర్ట్సుని చంపితే ఆనందం లభిస్తుందనుకున్నాడు. కాని దుఃఖమే లభించింది. తన జీవితం నష్టానికి అమ్ముడుపోయింది. పాలలా విరిగిపోయింది జీవితం.

మానవత్వమే మనిషిలో వెలిగే సత్యం. తనలో లేదెందుకని? తన పరిధి అంత సంకుచితమైనదా? తనకి ప్రేమించటం రాదు. శకుంతలను ఆనాడు ప్రేమించలేదు; కామించాడు! ప్రేమించివుంటే ఆమెకోసరం తన ఆనందాన్ని త్యాగం చేయగలిగివుండేవాడు. అలా చేయలేదు. అలా చేయగలిగివుంటే వారి దృష్టిలో దేవుడై వుండేవాడు. కనీసం మానవత్వాన్నికూడా ప్రదర్శించలేకపోయాడు. తన అస్తిత్వాన్ని పోగొట్టుకున్నాడు.

రాబర్ట్సు సమాధికేసి తలను కొట్టుకుని వెక్కివెక్కి ఏడ్చాడు.

"నిన్ను అర్థం చేసుకోలేకపోయాను రాబర్ట్స్... నన్ను క్షమించు–"

ఎవరూలేని ఈ సమయంలో గాఢసమాధిలాంటి నిశ్శబ్దంలో చీకటివీణను మ్రోగిస్తున్న ప్రకృతిలో సమాధిముందు కూర్చుని వేదన వెళ్ళబోసుకున్నాడు. ఎంత ఏడ్చినా తృప్తి కలగటంలేదు. ఆ క్షణంలో రాబర్ట్సు అతని ఆత్మకు ఆత్మే అయినాడు. ఏదో ఆత్మీయత ఆపేక్షతో పెనవేసుకుపోతాడు. గుండెలో దిగులు, గుబులు ముడివేసుకున్నాయి. శోకంలాంటి ఆ భావం శూలంలా హృదయాన్ని చీలుస్తూనేవుంది.

ఈ బాధని భరించలేడు. అగ్నిపర్వతాలు బ్రద్దలైపోతున్నాయి గుండెల్లో. శాంతి కావాలి. రాబర్ట్సు నిద్రపోతున్నాడే శాంతితో. అంత శాంతి కావాలి. ఎక్కడ ఆ శాంతి? ఆకాశంలో చుక్కలు నవ్వుకుంటున్నాయి.

రంగనాథం ఆత్మ ఏడుస్తూ ప్రార్థించింది.

"ఓ మృత్యుదేవతా! ఒకనాడు రాబర్ట్సు చేతిని నీ చేతిలో పెట్టాను. ఈనాడు నా చేతిని నేనే అందిస్తున్నాను. ఏ దారివెంట అతన్ని తీసుకెళ్ళావో ఆదారివెంటే నన్నూ తీసుకెళ్ళు. నీలో దైవత్వమున్నా, నిన్ను చూసి అందరూ భయపడతారు. నీకు నేను భయపడను. ఎవరికీ దొరకని శాంతి నీలో నాకు దొరుకుతుంది. నన్ను కరుణించి నా బాధనుండి విముక్తి కలిగించు. నీ కలలే మా జీవితాలు. నన్ను స్పర్శించి కలుషితమైనయి పీళ్లు. నీ స్పర్శతో వాటిని పరిశుద్ధం చేయి. మానవుడు సంపద పోగొట్టుకుంటే పోనీ, ఏమీ నష్టపోడు కాని వ్యక్తిత్వం పోగొట్టుకుంటే సర్వమూ నష్టపోతాడు. నేను అంతా నష్టపోయాను. కొందరు నీతిమంతులై పతనమైపోతారు. కొందరు పాపాలు చేసి పైకివస్తారు. కాని వారి నీతి, పాపం పతనంకావు. నేను పాపాత్ముడ్ని. కాని ఇంతవరకు సంఘంలో మంచివాడ్ని. అలా మంచివాడుగానే మిగిలిపోనీ. నాకు నేను దుర్మార్గుడ్ని అయినా లోకానికి మంచివాడుగా మరణిస్తాను. నేను ఓడిపోయాను. ఇక బ్రతికాలన్న ఉత్సాహం లేదు. నాకు శిక్ష కావాలి. నా పాపానికి పరిహారం కావాలి. నా పాపం నాతోనే అంతంకానీ. పాపం చేసి నా చేతులు మలినమైనయి. ఈ ప్రపంచంలోని నదులన్నీ కలిసినా వీటి మాలిన్యం పోగొట్టలేవు. నా పాపానికి వేరే ఏదో లోకంలో శిక్ష వుందంటే నాకు తృప్తి లేదు. నాకు నేనే శిక్ష వేసుకుంటాను. నా జీవితం అర్థంలేని తపస్సు అయింది. నా అన్వేషణకి అర్థములేదు"

రంగనాథం తల బాదుకున్నాడు. జీవితంలో విప్లవం వచ్చింది.

అతను గబగబా నడిచివెళ్ళాడు.

ఒక్కక్షణంలో అతని జీవితం ఎండుటాకులా నలిగిపోయింది.

చీకటిలో తరంగాలపైన మృత్యుదేవత నాట్యం చేస్తున్నది. రంగనాథాన్ని చేతులు చాచి ఆహ్వానించింది.

అతను పిచ్చివాడు ఐనాడు. వెర్రి ఆవేశంతో తూలుతూ నడిచాడు. అతని నరాలలో విద్యుచ్ఛక్తి ప్రవహిస్తున్నది.

అతని చూపులు దివి భువితో ఏకీభవించినయి. అతని కళ్ళకి స్థూలప్రపంచం సూక్ష్మమైపోతున్నది.

సుడిగుండం ఓరగా ఆశగా అతన్ని చూసి గుటకలు వేసింది. రంగనాథం కన్నీటిలో శకుంతల జారిపోయింది.

కెరటాలు నిరాశగా వెనక్కు మళ్ళుతున్నాయి.

రంగనాథం ఆఖరిసారిగా ఈ విశ్వాన్ని చూసి నదిలో దూకేశాడు. కెరటాలు అతన్ని శాశ్వతంగా తమ కౌగిటిలో ఇముడ్చుకున్నయి.

